

# గూళ్లు కట్టేవి, ఆక్రమించేవి

## చిన్నారి పాఠకులకు ప్రకృతి కథలు

విద్యా, రాజారాం శర్మ

అనువాదం : కె. సురేష్

## ఇతర కథలు:

రట్టు కాని గుట్టు

గుడ్ల రహస్యం

గుజ్జన గూళ్లు

రకరకాల పక్షులు



నోట మాట రాకుండా నేను అలా చూస్తూ ఉండిపోయాను. బూడిద రంగులో చిత్రంగా ఉన్న ఒక పిట్ట, దాని పెద్దముక్కు మరీ చిత్రంగా ఉంది. చెట్టు తొర్రలోకి అది ఆకులను ఎంతో కష్టపడి వేస్తోంది – ఒకటి తరవాత ఒకటి. మధ్య మధ్యలో పండ్లు కూడా వేస్తోంది. మెడ వెనక్కి వంచి, విదిల్చి ఎక్కడినుంచో ముక్కు చివరకు ఆకులను తెస్తోంది. ఇలా బహుశా 5 నిమిషాలపాటు చేసింది. అప్పుడు అది ముక్కును చెట్టు కాండానికి తుడుచుకుని ఎగిరిపోయింది.



చాలా పొడవాటి చెట్టుకి ఎంతో పైన ఆ తొర్ర ఉండటంతో నాకు ఏదీ అంత స్పష్టంగా తెలియటంలేదు. చెట్టు తొర్రల్లో ఉడతలు పండ్లను దాచుకుంటాయని విన్నాను. ఈ పిట్టలు కూడా అట్లాంటిదే ఏమైనా చేస్తున్నాయా?

ఇంకా అయోమయంలోనే ఉండి ఆ పిట్ట తిరిగి వస్తుందేమోనని పక్క చెట్టుకు ఆనుకుని చూడసాగాను.

ఈసారి భయంతో ఉలిక్కి పడ్డాను. చెట్టులోపల ఏదో ఉండి నీటిని పుక్కిలి పడుతున్నట్టు ఉంది. ఎడతెరిపి లేకుండా గరగరమనే పుక్కిలింత శబ్దం. చెట్టుకి చిన్న తొర్రను చూసి “మరో రంధ్రం!” అంటూ ఆశ్చర్యపోయాను.

మునిగాళ్లమీద నిలబడితే తొర్రలోకి చూడగలిగాను కానీ నాకు లోపల ఏమీ కనపడలేదు. గరగర శబ్దం తొర్ర లోపలినుంచి వస్తోంది.

నేను ఒక అడుగు వెనక్కి వేశాను. గోరింక అంత ఉన్న ఒక ఆకుపచ్చ పిట్ట ఆ చెట్టు కొమ్మమీద వాలింది. దాని నోటిలో ఒక మేడిపండు ఉంది.

చుట్టూ కలియచూస్తూ ఆ పిట్ట కాసేపు ఆ కొమ్మ మీద కూర్చుని ఉంది. దాని ముక్కు చాలా పెద్దగా, ఎర్రగా ఉంది. దాని శరీరంతో పోలిస్తే ముక్కు పెద్దదే.





కొంతసేపయిన తరవాత ఆ పిట్ట నేరుగా తొర్రలోకి దూరింది. లోపలున్న శబ్దాలు పెద్ద కోలాహలంగా, గరగరలు కలిసి వినపడుతున్నాయి. కొంచెం సేపటికి ఆ పిట్ట నోటి నిండా చెత్తతో బయటకు వచ్చింది.

“యాక్! ఏమిటది?” నేను పిట్టను అడిగాను.

దాని నోటినిండా ఉండటంతో అది సమాధానం ఎలా చెబుతుంది?

“అది ఇల్లు తుడుచుకుంటోంది. లోపల ఉన్న పిల్లలకు గూడు శుభ్రంగా ఉండాలికదా,” అంది వడ్రంగి పిట్ట.

“పిల్లలా? ఆ లోపల పిల్లలు ఉన్నాయా?”

“వాటి శబ్దాలు నీకు వినపడలేదా?”

“అంటే ఆ శబ్దాలు... ఆ శబ్దాన్ని పిల్లలు చేస్తున్నాయా?” నేను ఆశ్చర్యపోయాను, కానీ శబ్దం ఎక్కడి నుంచి వస్తోందో తెలిసి ఊరట కూడా పొందాను.

“ఇది మా అందరికి గూడు కట్టే సమయం. ఆ పొన్నాయి చెట్టులో నా గూడు ఉంది. అన్నిటికంటే కింద ఉన్న కొమ్మలో గుండ్రటి రంధ్రం కనపడుతోందా?





అది కొమ్మకి అడుగువైపున ఉంది. దాంట్లో నా పిల్లలు రెండు ఉన్నాయి. నా బాధ్యత పూర్తికావచ్చిందిలే!"

"అంటే?"

"పిల్లలకి రెక్కలొచ్చి ఎగరటానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక వాటి బతుకు అవి బతుకుతాయి," గర్వంగా చెప్పింది వడ్రంగి పిట్ట.

"అంటే ఆ పెద్ద బూడిదరంగు పిట్ట కూడా తన పిల్లలకు మేత పెడుతోందన్నమాట!"

"కాదు. దాని భార్యకి."

నేను ఖంగుతిన్నాను. అది చెప్పింది నేను సరిగ్గానే విన్నానా? వడ్రంగి పిట్ట ఎగిరిపోవటంతో తెలుసుకునే మార్గం లేకపోయింది.

వడ్రంగి పిట్ట గూటి గురించి ఆసక్తి పెరిగి దగ్గరనుంచి చూద్దామని వెళ్లాను. ఒకటి తరవాత ఒకటిగా పిల్లలు తల బయటికి పెట్టి చూస్తున్నాయి. తాము త్వరలో ప్రవేశించబోయే ప్రపంచాన్ని మెరిసే కళ్లతో నిశితంగా పరిశీలిస్తున్నాయి. కారణం ఏమోకానీ ఒక పిల్ల కూత వేద్దామని అనుకుంది. కిలకిలమంటూ పెద్ద నవ్వు మాదిరి ఏం కూతరా బాబు!

“పక్షులకు నాలుక ఉంటుందని నాకు ఇప్పటిదాకా తెలియదే!”





“పక్షులకు కూడా నాలుకలు ఉంటాయి. కొన్నిటికి పొట్టిగా ఉంటే, కొన్నిటికి పొడవుగా ఉంటాయి. మా నాలుకలు చాలా పొడవుగా ఉంటాయి, మా నోటికంటే నాలుక పొడవు,” చెట్టు కాండం మీద పైకి పాకుతూ చెప్పింది వడ్రంగి పిట్ట. “పొడవు నాలుక మాకు...”

అంతలో చెలరేగిన మోతకి చివరిమాటలు వినపడలేదు. పక్కన ఉన్న తురాయి చెట్టులో గోరింకలు, రామచిలుకలు గోలగోలగా అరుస్తూ గొడవ పడుతున్నాయి.

“ఏం జరుగుతోంది?” నేను అడిగాను.

“గూటికోసం కొట్లాట,” చెప్పింది వడ్రంగి పిట్ట.

“ఎందుకని?”

“ఆ చెట్టులోని రంధ్రం మాదంటే మాదని గోరింకలు, రామచిలుకలు కొట్టుకుంటున్నాయి. అవి కూడా చెట్టు తొర్రల్లో గూళ్ళు కడతాయి. చెట్టు తొర్రలేమో ఎప్పుడూ కావలసినన్ని ఉండవు!”

“తొర్రల గురించి ఎవరైనా ఎందుకు కొట్టుకోవటం. చేసినవాళ్లే యజమానులు!” దీంట్లో సమస్య ఏమిటో నాకు అర్థం కాలేదు.





“యజమానులని ఎవరూ ఉండరు,” చెప్పింది వడ్రంగి పిట్ట. “అదీకాక ఏ తొర్ర ఎవరు చేశారో ఎవరికి గుర్తు!”

చెట్ల తొర్రలు గురించి నాకు మరిన్ని వివరాలు తెలియచేసేందుకు వడ్రంగి పిట్ట సిద్ధపడింది. చెట్లు పెద్దవి అవుతున్నకొద్దీ కొన్నిచోట్ల బెరడు దెబ్బ తింటుంది. మనుషులు కొమ్మలను నరికివేస్తారు, లేదా తుఫాను సమయంలో కొమ్మలు విరిగిపోతాయి. చెట్టు కాండం మధ్యభాగం నీటికి తడిచినప్పుడు, శిలీంధ్రాల దాడికి గురయ్యి కుళ్లి పోతాయి. అటువంటప్పుడు అక్కడ చెట్టు తొర్రలు ఏర్పడతాయి.

“తొర్రలు సహజంగా ఏర్పడతాయి. వాటికి యజమానులు అంటూ ఉండరు,” తెలియచేసింది వడ్రంగి పిట్ట.

“కాని నీ గూటి రంధ్రం చక్కగా గుండ్రంగా ఉంది. అది సహజంగా ఏర్పడిన దానిలాగా లేదు.”

“కొన్ని రంధ్రాలను పక్షులు కూడా చేస్తాయి. ఏ చెట్టులోనైనా గుండ్రంగా ఉన్న రంధ్రం నీకు కనపడితే దానిని వడ్రంగి పిట్టగానీ, కంసాలి పిట్టగానీ చేసి ఉంటాయి.”

“కంసాలి పిట్టా?”





“నువ్వు అంతకు ముందు చూసిన పచ్చ పిట్ట అదే! దాని పూర్తి పేరు గోధుమ తల కంసాలి పిట్ట,” వివరించింది వడ్రంగి పిట్ట.

“అలాగా! అది కంసాలి పిట్టన్నమాట,” మళ్లీ తొర్రలోకి దూరిన పిట్టను చూపిస్తూ అన్నాను.

“అవును. చెట్టు కాండంలో గుండ్రటి రంధ్రాలు చెయ్యటానికి ఇవి తమ ముక్కుతో పొడుస్తాయి. ఆ తరవాత లోపలి భాగాన్ని తొలిచి తమ బెరడును గూటికి కావలసినట్లుగా చేసుకుంటాయి. మా లాగానే!”

పక్షుల ముక్కుల గురించి నేను అంతకు ముందెన్నడూ అంతగా పట్టించుకోలేదు. అవి రకరకాల పరిమాణాల్లో, రకరకాల ఆకారాల్లో ఉన్నాయి.

“ఒంపు తిరిగిన రామచిలుక ముక్కు చూస్తే అది రంధ్రం చెయ్యలేదని తెలిసిపోతుంది. మరి గోరింక సంగతి ఏమిటి?”

“నువ్వు పప్పులో కాలేశావు!” వెక్కిరించింది వడ్రంగి పిట్ట. “రామచిలుకలు తొర్రలను తొలిచి తమకు అనుకూలంగా చేసుకోగలుగుతాయి. కానీ గోరింకలు మాత్రం ఆక్రమణదారులే. వాస్తవానికి ఈ రెండు పిట్టలు ఎటువంటి రంధ్రాలలోనైనా గూడు కట్టుకోగలవు, చివరికి గోడల కన్నాల్లో కూడా ఇవి గూళ్లు కడతాయి.”





“అంటే రామచిలుకలు, గోరింకలు గూళ్లను దొంగిలిస్తాయన్నమాట.”

“దొంగతనం అనికాదు. అన్నిటికీ గూళ్లు కావాలి. మాలో కొన్ని సొంతంగా గూళ్లు చేసుకుంటాయి... మరి కొన్ని వాటిని కనుగొంటాయి! గూటి రంధ్రాన్ని కాపాడుకోటానికి ఎంతో సమయం, శక్తి వెచ్చించాల్సి వస్తుంది.”

తోపు నిశ్శబ్దంగా, ప్రశాంతంగా మారింది. గొడవ అయిపోయి రంధ్రాన్ని రామచిలుకలు చేజిక్కించుకున్నాయి. ఇదే విషయాన్ని నేను వండ్రంగి పిట్టతో చెప్పాను.

“అంత ఖచ్చితంగా చెప్పకు. ప్రస్తుతం యుద్ధ విరమణ జరిగి ఉండవచ్చు.

రెండు పిట్టలూ కయ్యానికి కాలుదువ్వేవే. చివరిదాకా ఏమీ చెప్పలేం,” అంటూ కంసాలి పిట్టను దాని గూడునుంచి ఇవి ఎట్లా తరిమేస్తాయొ చెప్పింది వడ్రంగి పిట్ట.

“కానీ అది అన్యాయం,” నేను ప్రతిఘటించాను.

ఏ కారణం ఇవ్వకుండా “ఏమీ కాదు,” అంది వడ్రంగి పిట్ట.

కయ్యానికి కాలు దువ్వే పిట్టల గురించి ఆలోచిస్తూ ఉండగా ఏదో నా పక్కనుంచి దూసుకెళ్లింది. నేను ఉలిక్కిపడి చుట్టూ బిత్తరచూపులు చూశాను.





“కొమ్ము పక్షి తిరిగి వచ్చింది,” పైన ఉన్న చెట్టు తొర్రవైపు చూస్తూ చెప్పింది వడ్రంగి పిట్ట. “అవి గూడు కట్టిన సమయంలో చాలా నిశ్శబ్దంగా ఉంటాయి. కానీ అవి ఎగురుతున్నప్పుడు మాత్రం పెద్ద చప్పుడు చేస్తాయి.”

కొమ్ము పక్షి. చిత్రంగా ఉన్న ఆ పక్షి పేరు అదన్నమాట. అయినా అవి తమ భార్యలకు మేత ఎందుకు పెడుతున్నాయో నాకు అర్థం కాలేదు. “కొమ్ము పక్షి భార్య గురించి ఇందాక ప్రస్తావించావు. ఏమిటది?”

“అవును! మాలాగే కాకుండా గుడ్లు పొదిగి, పిల్లలకి ఏడు రోజులు వచ్చేదాకా అమ్మ కొమ్ము పక్షి గూటిలోంచి బయటకు రాదు. అంటే నెలరోజులకు పైనే అది గూటిలో ఉంటుంది. ఈ సమయంలో

చిన్న బెజ్జం మినహాయించి రంధ్రాన్ని పూర్తిగా మూసివేస్తాయి. ఈ బెజ్జం నుంచే నాన్న కొమ్ము పక్షి ఆహారాన్ని అందిస్తుంది."

నేను విస్తుపోయాను. అన్ని రోజులపాటు ఒక పక్షి చీకటి రంధ్రంలో ఉండిపోవటమా! ఇది నిజంగానే చిత్రమైన పక్షి. చిన్న బెజ్జం మినహాయించి పూడ్చివేసిన రంధ్రం. ఇది నిర్బంధం. నేను ఆందోళనకి లోనయ్యాను. వడ్రంగి పిట్టకి ఇది అన్యాయమని అనిపించదని నాకు తెలుసు.

"చూడు!" అరిచింది వడ్రంగి పిట్ట. కొమ్ము పక్షి మీద ఒక గోరింక దాడి చేస్తోంది- తిట్లతో, తన్నులతో.





అంతకు ముందు రామచిలుకలతో గొడవపడిన గోరింక ఇదేనేమొ. పట్టు తప్పిన కొమ్ము పక్షి పక్క చెట్టుమీదకి వెళ్లింది. ఆహారం పెట్టటానికి కొమ్ము పక్షి వచ్చిన ప్రతిసారీ తరిమెయ్యటానికి గోరింక ప్రయత్నించింది.

“గోరింకలు పట్టు వదలని పిట్టల మాదిరి ఉన్నాయే. కానీ కొమ్ము పక్షి మాత్రం ప్రతిఘటించటం లేదు!”

“అది సహనానికి, విజయానికి రహస్యం!” చెప్పింది వడ్రంగి పిట్ట.

***

## పాత్రల పరిచయం



దక్షిణ ఢిల్లీలోని అటవీప్రాంతంలో సంజయ్ వన్‌లో 2010 మే - ఆగస్టు నెలల మధ్య పరిశీలనల ఆధారంగా రాసిన కథ.

పక్షుల, గూళ్ల వాస్తవ పరిణామాన్ని ఈ పుస్తకంలోని ఫోటోలు చూపకపోవచ్చు.



బంగారు వెన్ను వడ్రంగిపిట్ట



గోధుమ తల కంసాలి పిట్ట



గులాబి వలయపు రామచిలుకలు - మగది (మెడ చుట్టూ నలుపు, గులాబి రంగులలో వలయం ఉంటుంది), ఆడది



గోరింక



బూడిదరంగు కొమ్ము పక్షి - మగది



బూడిదరంగు కొమ్ము పక్షి - ఆడది

OWNERS AND APPROPRIATORS published by VIDYA ONLINE is licensed under a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 3.0 Unported License (http://creativecommons.org/licenses/by-nc-sa/3.0/)
Permissions beyond the scope of this license may be available at admin@vidyaonline.org

http://vidyaonline.net